# చిరుమువ్వలు



894.8271
VEN

ఈదుపల్లి వెంకటేశ్వరరావు

ci

894.8271
VEN
Dr. B.R. AMBEDKAR
OPEN UNIVERSITY
CALL NO: ACC. NO: 11705
AUTHOR:
TITLE:

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# చిరుముత్తెలు

[బాలగేయసంపుటి]

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11705

రచన:

## ఈదుపల్లి వెంకటేశ్వరరావు

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11705

[అన్నిహక్కులు
గ్రంథకర్తవి]

[వెల: 2-50

ప్రథమ ముద్రణ
1000 ప్రతులు
ఫిబ్రవరి 1983

894.8271
VEN-C

# అంకితం

ఉత్సాహవంతుడూ, యువజన నాయకుడూ
ప్రస్తుత రాజ్యసభ సభ్యుడూ, కళాభిమాని అయిన
కె. వి. ఆర్. యస్. బాలసుబ్బారావుగారికి

ముఖచిత్రం :
కోటిసూర్య.

ప్రతులకు :
జగదీష్ బుక్ స్టాల్
క్రొత్త బస్ స్టాండ్
ఏలూరు.

ముద్రణ :
శ్రీ సీతారామాంజనేయ ప్రెస్,
ఏలూరు - 534 001

AOUHALO5B133

# విషయసూచిక

1. మురిపాల పాపాయి
2. బాలలు
3. చిన్నారి పాపాయి
4. రామచిలుక
5. తొలకరి చినుకులు
6. పెద్దచదువు
7. విరిసీ విరియని మల్లెలు
8. తిరుగాడే చందమామ
9. మంచి పుస్తకాలు
10. అపాయంలో ఉపాయం
11. మంచుబొట్లు
12. వారసులు
13. ముత్యాల మాలలు
14. బుజ్జాయి
15. సీతాకోకచిలుక
16. ఉడత
17. చిరుగాలి
18. బొండుమల్లెలు
19. గగనంలో వంతెన
20. ధ్రువతార
21. మా పాప
22. బుజ్జినవ్వులు
23. మా బాబు
24. మంచుజడిలో మల్లెపూలు
25. తల్లికి అందం
26. గులాబి
27. సన్నజాజి పువ్వులు
28. జట్టు
29. బేబీ
30. అటుచూడవే అమ్మ
31. నవ్వరా !
32. వర్షం - హర్షం
33. అమ్మా !
34. పాలనురుగులు
35. పాప నవ్వులు
36. కోయిల
37. కలయికలో వున్న విలువ
38. సహకారం
39. మిణుగురు
40. తల్లిమనసు
41. ప్రకృతిలో పాపాయి
42. గాలిపటం
43. గాలిలో దీపం
44. చిరుతప్రాయులు
45. భారతమాత

బాలలే విజ్ఞాన కేతువులు - నేడు రేపుల మధ్య పేతువులు
చంద్ర బంధుర సుధా శీతువులు - మానవత్వ వికాసహేతువులు

—శ్రీ శ్రీ

# పిల్లగాలి

—డాక్టర్ సంజీవదేవ్

దుమ్ము, ధూళి, మన్ను, మసి, అన్నం, సున్నం అన్నీ ఒకటే పెద్దలు కాని మనుషులకు. పెద్దలు కాని మనుషుల ప్రపంచం పెద్దల ప్రపంచంకంటే భిన్నం.

దుమ్ము, ధూళి, మన్ను, మసి, అన్నం, సున్నం అన్నీ ఒకటికాదు పిల్లలుకాని మనుషుల దృష్టిలో. అవన్నీ వేరువేరు వస్తువులు. అన్నం, సున్నం తప్ప మిగతా నాలుగు వస్తువులూ కూడ విలువలేనివి పిల్లలు కాని మనుషుల దృష్టిలో.

పిల్లలుకాని మనుషులు పెద్దలు కనుక వారికి సృష్టిలోని వన్నీ భేదాన్ని కప్పుకొని భిన్నభిన్నంగా ముక్కలు ముక్కలుగా గోచరిస్తాయి.

విశ్లేషణ వారి లక్షణం.

పెద్దలు కానిమనుషులు పిల్లలు కనుక వారికి సృష్టిలోనివన్నీ ఏకత్వాన్ని కప్పుకొని ఒకటిగా అఖండరూపంలో చరిస్తాయి.

పెద్దల దృష్టిలో నిలువలేనివి కూడ పిల్లలకు ఎంతో విలువ.

పెద్దలది ఉపయోగదృష్టి, పిల్లలది రసదృష్టి.

పెద్దలకు కావలసిందిలాభం; పిల్లలకు అవసరం అయింది ఆనందం.

బంగారుకలశం, మట్టిముంత, రెండూ ఒకటే బాలల దృష్టికి. వాటితో ఆడుకోటం అయిన తరువాత రెంటినీ కూడ సమానంగా విసురుతారు జలాశయంలోకి !

అందుకే బాలలకూ కవిత్వానికీ బాంధవ్యం ఎక్కువ. అందుకే బాల కవిత్వం ఏటేటా వికసిస్తుంది.

బాలకవిత్వం అంటే బాలలు వ్రాసే కవిత్వంకాదు, పెద్దలు బాలలకు, సంబంధించి వ్రాసే కవిత్వం.

ప్రకృతి కవిత్వం అంటే ప్రకృతి స్వయంగా రచించుకొనే కవిత్వం కాదు, ప్రకృతిని గురించి మనుషులు రచించే కవిత్వం.

అనేక కవులు అనేక విషయాలను గురించి కవితారచన చేస్తారు, కొందరు కవులు బాలలను గురించే ఎక్కువగా కవితలల్లుతారు.

శ్రీ ఈదుపల్లి వెంకటేశ్వరరావు బాలగేయాలు రచించటంలో ఎక్కువ అభిరుచిని చూపుతారు.

దాని ఫలితమే ఈ బాలగేయాల సంపుటి "చిరుమల్లెలు". ఈకవితలు లయమయ గతిని కలిగివున్నందున పాడటానికి ఎక్కువగా పనికివస్తయి.

పాడటం అంటే గానం చేయటం. గానం చేయటానికి వీలయినదే గేయం.

ఈ కవిది ఇది తొలి ప్రచురణ. ప్రచురణ తొలిది అయినప్పటికీ రచన తొలిదిగా అనిపించదు!

తొలిది అంటే లేతది. చిరుమల్లెలు లేతవిగా గోచరించవు, కొంత ముదురుగానే గోచరిస్తయి.

ప్రతి కవీ భావుకుడే. భావుకుడు కాంది కవికాలేడు. కొందరు కవులు ఎక్కువ భావుకులు, మరికొందరు తక్కువ భావుకులు.

శ్రీ వెంకటేశ్వరరావు ఎక్కువ భావుకుడు. కనుకనే

"మిన్నులోని చుక్కలట్లు
పన్నజాజి పూవులట్లు
పచ్చికలో మంచుబొట్లు
ఎంచక్కా జట్లు జట్లు

"తరుణ సూర్యకిరణాలకు
తళతళా మెరుస్తాయి
చిరుపాపల నవ్వుల్లా
సురిపాలను చిందుతాయి"

"ఇంద్రధనుపు అందాలను
ఇలమీదనె నిల్పుతాయి
క్షణకాలం చూచువారి
కనులు విందుసల్పుతాయి."

గేయరీతి బాగున్నది సరళశైలిలో. బాలల నిమిత్తం రచించబడిన గేయాలను బాలలంతా అర్థం చేసుకుంటారా అనే ప్రశ్న, పెద్దల నిమిత్తం రచించ బడిన వాటిని పెద్దలంతా అర్థం చేసుకొంటారా అన్నట్లుంది!

పెద్దలంతా అర్థం చేసుకోలేనట్లే బాలలంతా అర్థం చేసుకోలేరు. అర్థం కొందరు పెద్దలు మాత్రమే చేసుకొంటారు; అదేవిధంగా కొందరు బాలలు మాత్రమే చేసుకొంటారు.

చదవటం వచ్చిన పెద్దలందరికీ, పిల్లలందరికీ చదివిందంతా అర్థం కాదు. అందుకని పెద్దలనిమిత్తమూ పిల్లల నిమిత్తమూ కవితారచన చేయటం మానుకుంటారా? అర్థం అయేవాళ్లయినా చదువుకుంటారుగా?

బాలగేయాలు ప్రధానంగా బాలల నిమిత్తమే రచించబడినా అవి పెద్దలకు కూడ చదువుతుంటే ఆనందం ఇస్తయి.

బాలల నిమిత్తం పెద్దలు రచించినట్లే బాలలు కూడ పెద్దల నిమిత్తం రచిస్తే ఎంత బాగుంటుందో!

బాలలు బాలల నిమిత్తమే రచించరు, ఇంకా పెద్దల నిమిత్తం ఏం రచిస్తారు!

ఈదుపల్లికవి మహాకవి గురజాడ వారి ముత్యాల సరాల బాణీలో కూడ కొన్ని బాలగేయాలు ఇంపుగా సొంపుగా రచించారు.

"చూడు చూడు బాలలారా
చూడుడవిగో మనసుతీరా
నీలి గగనపు సీమ నక్ష
త్రాల బృందములన్"

"వన్నెచిన్నెల సన్నజాజులు
మిన్నుమీదను జల్లినట్టుగ
ఇంపుసొంపులు చిందుచుక్కల
గుంపులయ్యవిగో"

"అమరలోకములోని అచ్చర
లేమలుంచిన దివ్వెలేమో
ఆరకుండా వెలుగురిక్కల
బారులయ్యవిగో"

బాలగేయాల్లో బాలలకు భావసౌందర్యం కంటే శ్రవ్యపరిమళం ఎక్కువ నచ్చుతుంది. భావించటం కంటే కంటితో చూడటం, చెవితో వినటం బాలల మానసాలకు గాఢంగా అంటుతుంది.

అటువంటి శ్రవ్యపరిమళం ఈ "చిరుమల్లెలు"లో వెదకకుండానే గోచరిస్తుంది.

గేయానికీ గేయం కాని దానికీ భేదం ఎక్కడ ? ఒకే శబ్దాలను ఒక స్థలంలో వుంచితే, వాటినే స్థలాన్ని మార్చివుంచితే గేయం కాక పోవటం, కావటం అవుతయి.

'ఇందిర ఇంద్రధనసును గాంచెను' అన్నపుడు ఆ వాక్యంలో గతిలేదు, అది కేవలం వచనంవలె వినిపిస్తుంది. కాని అదే వాక్యంలోని మాటలను స్థానం మార్చివాడినపుడు అందులో గతి ఏర్పడి గేయంగా వినిపిస్తుంది.

'ఇందిర గాంచెను ఇంద్రధనసును' అని అన్నపుడు పై వాక్యాన్ని చదవటానికే కాక పాడటానికి కూడ వీలుంటుంది.

రెండువాక్యాల్లో మాటలుకూడ ఒకటే. అయినప్పటికీ వాటి స్థానాంతర ప్రయోగంవల్ల ఆ మార్పు వస్తుంది.

ఈ 'గతి' అనేది ఏర్పడ్డపుడు కవితలోకి ఒక శ్రవ్యపరిమళం ప్రవేశిస్తుంది. తాళం వేయటానికి వీలులేని కవిత పద్యం అవుతుంది. పద్యానికి రాగం మాత్రమే వుంటుందికాని తాళం వుండదు; గేయానికి రాగం, తాళం రెండూ వుంటయి.

"చిరుమల్లెలు"లోని కవితలన్నీ తాళబద్ధాలు. కనుక అవి గేయాలు కాబట్టి అవి బాలల హృదయాలకు భాసంతో పనిలేకుండానే హత్తుకుంటవి.

ఈ గేయాల్లో ప్రకృతి చిత్రణ ఎక్కువగా గోచరిస్తుంది. ఒక్కొక గేయం ఒక్కొక శ్రవ్య ప్రకృతిచిత్రంగా ప్రత్యక్షమవుతుంది.

"కడలిపైపరిగెత్తే
ఓడలకన్నా
నదులమీద పయనించే
పడవలకన్నా
మిన్నులోన తిరుగాడే
మబ్బులెంతో అందము
కన్నుల కానందము"

"వానవెనుక గగనంలో
వంతెనలా కనిపించే
ఇంద్రధనుపు సోయగాలు
ఇంకా ఆనందము"

ఈ కవి మామూలు మాటల్లో తేటతేట పాటల్ని సృష్టించటంలో సఫలులైనారు. వీటిల్లో భావం వుంటుంది; పాడగలిగితే రాగం వుంటుంది; వేయగలిగితే తాళం వుంటుంది।

బాలసాహిత్యంలో కేవలం నీతిని బోధిస్తే మాత్రమే చాలదు, జీవన రీతిని కూడ బోధించాలి. పిల్లల్ని మీరు అదిచేయకూడదు, ఇది చేయ కూడదు, అది చేస్తే పాపం, ఇది చేస్తే పుణ్యం అనే నియమ నిబంధన లతో బంధించితే వాళ్ల మానసవికాసం సంకుచితం అవుతుంది. భూమి మీద కాలుకదిపే అవకాశం వుండదు, స్వేచ్ఛాచింతనకు తావుండదు, భయాన్ని విడనాడే అవకాశం వుండదు.

జీవితంలో ఏవిధంగా సంచరిస్తే తోటివారికికూడ మేలుకలుగుతుంది, ఏవిధంగా తమచుట్టూవున్న ప్రాకృతిక పరిసరాలను ఆనందించాల, ప్రేమ, కరుణ, సానుభూతి, సహిష్ణుత మొదలైనవి అలవడటానికి జీవితాన్ని ఎట్లా నడపాలి, మొదలైన వైఖర్లు వికసించే విధంగా బాలసాహిత్యం సృష్టించ బడితే బాలలకు వినోదం, విజ్ఞానం కూడ లభించే అవకాశం వుంటుంది.

ఈ క్రింది గేయాల్లో ఈ కవి కొన్ని వైజ్ఞానిక సత్యాలను క్రీడాత్మ కంగా అభివ్యక్త పరుస్తారు :

"అటుచూడవే అమ్మ
ఆకాశమందూ
పేలాలు ఎవ్వరే
పారబోశారు ?"

"పేలాలు కాదురా
నా పిచ్చికన్నా
చాల దూరానున్న
చుక్కలవియన్నీ"

"వెన్నముద్దను ఎవరు
పైన పెట్టారే!
వెన్నముద్దా కాదు
నా వెర్రినాన్నా"
"చల్లగా వెలిగేటి
చందమామదిరా
పట్టుపరదాలెవరు
పరచివుంచారే?

"పరదాలుకాదురా
మురిపాల కూనా
మెలమెల్లగా కదులు
తెలిమబ్బులవిరా."

చిన్నపిల్లలకు సృష్టిలోని వైజ్ఞానికసత్యాలన్నీ కళాత్మక అభివ్యక్తులుగా గోచరిస్తయి. వారిలోని ఆ కళాత్మక అనుభూతికి భంగం కలిగించకుండానే వాటి వైజ్ఞానికదశను కూడ విశదపరచాల. పై కవితలో అదే జరిగింది.

చందమామను వెన్నముద్దగా చూడటం కళాత్మక దృక్పథం. వాస్తవానికది వెన్నముద్దకాదు, చందమామ అనే గ్రహం (లేక ఉపగ్రహం) అని విశదపరచి చెప్పటం వైజ్ఞానిక దృక్పథం. పిల్లల్లో ఈ రెండు విధాల దృక్పథాలను కూడా అలవర్చేవిధంగా బాలసాహిత్యం రచించబడాల.

ఇందులోని గేయాల్లో ప్రకృతి వర్ణనలు మాత్రమేకాక జీవితానికి సంబంధించిన అనేక విషయాలను గురించిన గేయాలున్నాయి.

బాలబాలికల జగత్తుకు సంబంధించిన ఎన్నోదశలు ఇందులో స్పృశించబడివున్నాయి.

కవితారచన మనోరంజనను కలిగించటం ప్రధానం, సందేహం లేదు, కాని మనోరంజనకు తోడు మనోవికాసాన్ని కూడ కలిగిస్తే అది వెలుగుగల కవిత అవుతుంది.

ఈదుపల్లి కవితలు పదప్రయోగంలోను, భావాభివ్యక్తిలోను, విషయ విశదీకరణలోను, కవితాశిల్పంలోను ఒక సరళమైన వైలక్షణ్యాన్ని కలిగి వున్నాయి.

ఈ కవిలోని కవితాప్రతిభ బాలగేయాలవరకే బంధించబడివుండక ప్రౌఢగేయాలలో కూడ సుదృఢంగా ప్రవేశించి విశిష్టరూపంలో రూపొందా లనే అవసరం కనిపిస్తుంది. అటువంటివి ఇదివరకే కొన్ని వ్రాయలేదని కాదు, ఇంకా ఎక్కువ వ్రాయాలనే.

కవులు చాలామంది కవితాలోకానికి సంబంధించని వృత్తుల్లో వుండటం జరుగుతుంది. శ్రీ ఈదుపల్లి వెంకటేశ్వరరావు కూడ అంతే.

అయినప్పటికీ, ఆయన కవితారచనవల్ల తన వృత్తికికాని, తనవృత్తి వల్ల తన కవితావ్యాసంగానికి కాని భంగం కలగకుండా శ్రీ ఈదుపల్లి జీవితాన్ని గడపటం అభినందనీయం.

పిల్లలనిమిత్తం రచించినా, పెద్దలనిమిత్తం రచించినా కవిత కవితగానే ప్రభాసిస్తుంది, ప్రభావిస్తుంది, నేపథ్యంలో ప్రభోదిస్తుంది కూడ.

# ఎదలో హరివిల్లులున్న ఈదుపల్లి

తెలుగుతోటలో ఎప్పటి కప్పుడు కొత్తపూలు పూస్తున్నాయి, తెలుగునాట నిత్యనూతనంగా సుగంధ పరిమళాలు వీస్తున్నాయి, తెలుగు స్రవంతిలో కొత్తకెరటాలు అనుభవాల ఒడ్డును చేరుకొంటున్నాయి.

కొత్తపూవుల్లో కొత్తపువ్వు మా వెంకటేశ్వరరావు. పరిమళ స్నాతుడతడు. బాలానందంలో పాలుపంచుకునే నాల్గుపదుల అనుభవాల పసివాడు, పసిడిమనసువాడు.

చిట్టిపాపాయి నవ్వుల్లో వేయిమల్లెల్ని, పలుకుల్లో తేనెజల్లుల్ని, చూపుల్లో పాలవెల్లుల్ని అతను చూస్తాడు — మురిసిపోతాడు. అతని పలుకులో తేటదనం ఉంది. భావాల్లో లేతదనం ఉంది. ఈ పుస్తకం ప్రచురించడంలో ఒకానొక తెంపరితనం ఉంది. భవిత కవితామయం కావాలన్న తపన ఉంది.

బాలసాహిత్యం అనగానే చింతాదీక్షితులు, మసూనా, కవిరావు, డాక్టర్ మిరియాల, బాలబంధు బీ వీ, రేడియో అన్నయ్య - అక్కయ్య, వగైరా వగైరా ఎందరో జ్ఞాపకం వస్తారు. వాళ్ళందర్ని చదివి, వారివారి రచనామార్గాల్ని అవలోడనంచేసి, కలం పట్టుకున్నాడు ఈదుపల్లి.

ఇతనికి పండిత భిషక్కుల భాషాభేషజం లేదు. కుహనా సంస్కారం లేదు కులాహంకారం లేదు. అంతరాలు తెలియని బాలల లోకంలో వాళ్ళతో కలిసి ఆడుకుంటూ, పాడుకుంటూ, వాళ్ళ భాషలోనే హితవు పలుకుతూ, వారికి మార్గదర్శిగా ఉండాలన్నది ఈదుపల్లి కాంక్ష. ఆ ఆకాంక్షకు ప్రతిరూపమే "చిరుమల్లెలు" అన్న ఈ బాలగేయ సంపుటి.

పుస్తకం పేరే రమణీయంగా ఉంది. పుస్తకంలో ఉన్న గేయాలు రమణీయార్థ ప్రతిపాదకాలుగా ఉన్నాయి. రామచిలుక, తొలకరి చినుకులు, చందమామ, పుస్తకాలు, మంచుబొట్లు, సీతాకోకచిలుక, మంచిముత్యాలు, ఉడుత, గాలి, ఆకాశంలో వంతెన, పిల్లల నవ్వులు, వర్షం, పాలనురుగు, కోయిల, ఐకమత్యం, సహకారం, మిణుగురులు, గాలిపటం, దేశమాత, అన్నీ ఈదుపల్లికి కవితావస్తువులే! కొన్ని కవితల్లో చిన్నచిన్న సంఘటనలు, కొన్నింట్లో కేవలం వర్ణనలు, కొన్నిచోట్ల వస్తు విశ్లేషణ, అయితే ఎక్కడా కవి తన లక్ష్యాన్ని మర్చిపోలేదు. పిల్లలకు ఇష్టమని అభూత కల్పనలు, అనారోగ్యకరమైన కథారచనం చెయ్యలేదు. పిల్లలుగా ఉన్నప్పుడే తర్కబద్ధంగా, శాస్త్రీయంగా అవసరమైన మంచి విషయాలను వాళ్ళ మనసుల్లోకి ఎక్కించాలి. ఈ విధంగా ఆలోచిస్తే "చిరుగాలి," "కలయికలో వున్న విలువ" వంటి రచనల్ని ఆదరించవలసిన అవసరం పాఠకులపైన ఎంతైనా వుంది.

ఈదుపల్లి వెంకటేశ్వరరావు సామాజికచేతన ఉన్న కవి. ఒక్కొక్క మెట్టుగా పైకి ఎక్కుతూ అతను తన గమ్యం చేరుకోగలడనటానికి ఈ 'చిరుమల్లెలు' ప్రాణమున్న కవితాక్షరాలు.

ఏలూరు

కొండవీడు శ్రీరామచంద్రమూర్తి
సభ్యులు : ఆంధ్రప్రదేశ సాహిత్యఅకాడమీ.

# కృతజ్ఞతాంజలి

ఇది అప్పుడప్పుడూ వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డ నా బాలగేయ సంపుటి. మొదట యీ గేయాలను తమ పత్రికలలో ప్రచురించిన, ఆంధ్ర ప్రభ, ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, బాలజ్యోతి సంపాదకులకు నాకృతజ్ఞతలు. ఈపుస్తకానికి అవసరమైన ద్రవ్యసహాయాన్ని చేయించి, దీని ప్రచురణకు ప్రధాన కారకులైన రాజ్యసభ సభ్యులు శ్రీ కమ్ముల బాలసుబ్బారావుగారికి నా కృతజ్ఞతను తెలుపుకుంటున్నాను. అత్యంత సుందరంగా, ఆత్మీయతా బంధురంగా దీనికి ముందు మాటలు వ్రాసి, నా చిన్నిపుస్తకాన్ని మిన్నగా అలంకరించిన కొండముదివారికి హర్షపులకిత హృదయంతో అభివందనా లర్పిస్తున్నాను. నా చిరుమల్లెల మృదుపరిమళాలను పదుగురికీ పంచిపెట్టాలనే సదుద్దేశంతో తొలిపలుకు పేరున "పిల్లగాలిని" జతచేసిన మంజుల హృదయులు మా సంజీవ్‌దేవ్‌గారికి నా కృతజ్ఞతాంజలి సమర్పిస్తున్నాను.

ఈ సంపుటిలోని 'బేబి' అన్న గేయాన్ని మొట్టమొదట తమ ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురించి, నన్ను పరోక్షంగా ప్రోత్సహించిన ప్రఖ్యాత సంపాదకులు శ్రీ నార్లవారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నా. అలాగే ఈ పుస్తక ప్రచురణకి అవసరమైన ఆర్థికసహాయాన్ని అందించిన జిల్లా సాంస్కృతిక మండలివారికీ, జిల్లాకలెక్టరువారికీ, ఈ విషయంలో తమపంతు సహాయాన్ని అందించిన డి. పి. ఆర్. ఓ. గారికీ, సాంఘిక సంక్షేమాధికారి రాధాకృష్ణయ్యగారికీ నా ధన్యవాదాలు ప్రకటించు కుంటున్నాను. నా సంపుటికి చక్కని ముఖచిత్రాన్ని వేసి తన అభిమానాన్ని

చాటించిన వర్ధమాన చిత్రకారుడు, చిన్ననాటిమిత్రుడు శ్రీ కోటిసూర్యకు నాహార్దికాభినందనలు తెలుపుకుంటున్నాను. ఈ "చి రు మ ల్లె లు" అనే సంపుటిని శ్రద్ధగా, చక్కగా ముద్రించిన శ్రీ సీతారామాంజనేయ ప్రెస్ వారికికూడా నా ధన్యవాదాలు వెల్లడిస్తున్నా. ఇందులోని ఏ ఒక్క గేయమైనా ఓ చిన్నారి హృదయాన్ని మురిపిస్తే నా కృషి సార్థకమైనట్టుగా సంతోష పడతాను.

ఏ లూ రు,
6_2_1983.

ఇట్లు
రచయిత

# మురిపాల పాపాయి

చిన్నారి పాపాయి
చిట్టి పాపాయి
నీ నవ్వులో వేయి
మల్లె లున్నాయి

బుల్లి బుల్లి పాపాయి
బుజ్జి పాపాయి
నీ పలుకులో తేనె
జల్లు లున్నాయి

ముద్దు పాపాయి
నీ చూపులో పాల
వెల్లు లున్నాయి

గారాల పాపాయి
గడుసు పాపాయి
నీ లేత ఎదను హరి
విల్లు లున్నాయి

ఆంధ్రప్రభ వారపత్రిక
28-4-71

# బాలలు

ముద్దుముద్దు బాలలు
ముత్యాల మాలలు
వారిచిలిపినవ్వులే
సిరివెన్నెల సోనలు

వానజల్లు కురిసినా
మెరుపుతీగ మెరిసినా
ఆకాశపు వీధులలో
హరివిల్లే విరిసినా

అవియన్నీ తమకోసమె
అవతరించెనని మురిసే
పట్టి ముగ్ధ ప్రాణాలు
చిట్టి పొట్టి కూనలు ॥ముద్దు॥

చందమామ వచ్చినా
చుక్కపూలు విచ్చినా
గున్నమావి చెట్టుమీద
కోయిలమ్మ కూసినా

పట్టరాని మోదముతో
పొంగిపోవు బాలలు
చిన్న ఉడతపిల్లలా
చిందులేయు బేలలు ॥ముద్దు॥

విశాలాంధ్ర
2-1-77

# చిన్నారి పాపాయి

చిన్నారి పాపాయి
చిరునవ్వు చూడు
పరుగెత్తు సెలయేటి
కెరటాల కీడు

కపట మెరుగని పాప
కనులోంక చూడు
కనరాని దేవుడే
కనిపించుతాడు

ఆటలాడే పాప
అల్లరులు చూడు
మధురానుభూతిలో
మది తేలియాడు

వచ్చి రానీ పాప
ముచ్చట్లు చూడు
కోయిలమ్మలు గుండె
కొమ్మపై పాడు

విశాలాంధ్ర
6-5-79

# రామచిలుక

ఎక్కడిదో ఒక చిలుక
ఎగిరివచ్చింది
మా జామిచెట్టుపై
తిష్టవేసింది

కొమ్మపై రెమ్మపై
కదలసాగింది
పంచవన్నెలతోను
విందు చేసింది

ప్రతిపండు నొకసారి
పొడిచి చూసింది
ముద్దు ముద్దుగ ఏవో
సుద్దులాడింది

అటుచూసి యిటుచూసి
రెక్కలార్చింది
రివ్వుమని ఎచటికో
పరుగు తీసింది

విశాలాంధ్ర
5-8-79

# తొలకరి చినుకులు

అల్లీ బిల్లీ పాపల్లారా
ఆడే పాడే పిట్టల్లారా
ఏదీ ఏదీ యిటురండీ
ఇంపుగ ముద్దులు యివ్వండీ

పరుగులు తీసే తరగలు మీరు
వెలుగులుపూసే తారలు మీరు
మాయాలోకపు మలిన మంటని
మంజుల మల్లెల రేఖలు మీరు

తీయని తలపుల ఊయలలోన
మనసును ఊపే కవితలు మీరు
తీరని బాధల తాపం బాపే
తొలకరి జల్లుల చినుకులు మీరు

పూసిన మామిడి కొమ్మల మాటున
పొంచిన కోయిల పిలుపులు మీరు
నింగిని తిరిగే మబ్బుల చాటున
నిగ నిగ మెరిసే మెరుపులు మీరు

విశాలాంధ్ర
17-6-79

# పెద్ద చదువు

పలకతేవే అమ్మ
బడికి వెడతాను
బుద్ధిగా అ ఆ లు
దిద్దుకుంటాను

మాష్టారు చెప్పేటి
మంచి కథలన్నీ
గోలచేయక నేను
ఆలకిస్తాను

ప్రతిరోజు నాన్నారి
ప్రక్కలో చేరి
చక్కగా ఆ కథలు
చెప్పుతుంటాను

అన్నాయిలా నేను
కొన్నాళ్ల కెదిగి
పెద్దచదువులు చదివి
పేరు తెస్తాను

విశాలాంధ్ర
20-7-79

# విరిసీ విరియని మల్లెలు

తెలిసీ తెలియని పిల్లల్లార
విరిసీ విరియని మల్లెల్లార
మిమ్ముకు చూస్తే నాలో కురియును
కమ్మని పున్నమి వెన్నెల ధార

చిలిపి నవ్వులను కురిపిస్తారు
చీకూ చింతలు మరిపిస్తారు
నిర్మలమైన మీ చూపులతో
మమతలు రేపీ మురిపిస్తారు ॥ తెలిసీ ॥

చిలుకల్లాగా వచ్చీరానీ
పలుకులు తియ్యగ వినిపిస్తారు
ద్వేషం మోసం తెలియని ఎవరో
దేవతలల్లే కనిపిస్తారు

చిట్టీ పొట్టీ అడుగులతోను
చిందులు వేస్తూ పరుగెడతారు
ఏది చూసినా సంబరపడుతూ
ఇంటికి సందడి కలిగిస్తారు ॥ తెలిసీ ॥

విశాలాంధ్ర

# తిరుగాడే చందమామ

దివినివీడి చందమామ
దిగివచ్చింది
చిరుపాపగ మా యింటను
తిరుగాడింది

మబ్బుతోను మెరుపుతీగ
తగువాడింది
చంటిపాప నవ్వుతోను
జతకూడింది

చిలుకపలుకు తియ్యదనం
ఎగిరొచ్చింది
చిన్నిపాప మాటల్లో
చిందేసింది

సిరిమల్లెల మెత్తదనం
తరిలొచ్చింది
కొంచెపాప కన్నుల్లో
కదలాడింది

విశాలాంధ్ర
6-7-80

# మంచి పుస్తకాలు

మంచి మంచి పుస్తకాలు
మనసు నెపుడు పెంచుతాయి
ప్రాణమిచ్చు మిత్రుల్లా
ఆనందం పంచుతాయి

పెద్దలాడు ప్రతీమాట
పసిడికన్న విలువకదా
అట్టి పసిడి పలుకులకూ
పుస్తకాలె నెలవుకదా

దిక్కుతోచనట్టివేళ
చిక్కులు వెతపెట్టువేళ
మంచిపుస్తకాన్ని విప్పు
అదే నీకు హితం చెప్పు

పిల్లలార చక్కనైన
పుస్తకాలు చదవాలీ
ముందు ముందు మీరు మంచి
మనుషులుగా ఎదగాలీ

విశాలాంధ్ర
1-3-81

(2)

# అపాయంలో ఉపాయం

గరికతింటు అడవిలోన
గాడిదొకటి తిరుగసాగె
తోడేలుకు దాన్ని చంపి
తినాలన్న తలపు రేగె

తోడేలును పసికట్టిన
గాడిద కొక యుక్తి తట్టె
ఈడ్చుకుంటు వెనుకకాళ్లు
కుంటినడక మొదలుపెట్టె

అదిచూసిన తోడేలుకు
ఆనందం మేర మీరె
కుంటిచుంటి వేమిటంటు
కుశల మడిగి దరికి చేరె

ముల్లొక్కటి నాకాలికి
గుచ్చుకుంది నేస్తకాడ
అది తీయక నన్ను తించె
గుచ్చుకొనును నీకు కూడ

ఆమాటలు వినగానే
తోడేలుకు నోరు వూరె
ముల్లుతీయ ఆ గాడిద
వెనుకకాళ్లకడకు చేరె

సాచిపెట్టి తోడేలును
తన్ని ఖరము పారిపోయె
ఆశపడ్డ తోడేలుకు
ఉన్నపళ్లు జారిపోయె

# మంచు బొట్లు

మిన్నులోని చుక్కలట్లు
సన్నజాజి పువ్వులట్లు
పచ్చికలో మంచుబొట్లు
ఎంచక్కా జట్లు జట్లు

తరుణ సూర్యకిరణాలకు
తళా తళా మెరుస్తాయి
చిరుపాపల నవ్వుల్లా
మురిపాలను చిందుతాయి

ఇంద్ర ధనువు అందాలను
ఇల మీదనె నిల్పుతాయి
క్షణకాలం చూచు వారి
కనులు విందు సల్పుతాయి

వాటి ఉనికి కంత కన్న
మేటి విలువ ఏమున్నది ?
పరులకింత ముదముకూర్చు
బతుకులోనె ఘనతున్నది

ఆంధ్రజ్యోతి వారపత్రిక
6-10-72

# వారసులు

చిన్ని చిన్ని పాపలార
సన్నజాజి పూవులార
కల్లాకపటము లెరుగని
ఉల్లాసపు జీవులార ॥ చిన్ని ॥

మీరె భావికాలానికి
వారసులని మరువకండి
చదువుమాని బద్ధకించి
సోమరులై తిరుగకండి ॥ చిన్ని ॥

పుస్తకాలెసుమా మనిషి
మస్తకాన్ని మార్చుతాయి
ఎన్నటికైనా తప్పక
ఉన్నతి సమకూర్చుతాయి ॥ చిన్ని ॥

ఈ సత్యము మీ మదిలో
ఎల్లప్పుడు ఉంచుకోండి
పూనికతో దినదినమూ
జ్ఞానమ్మును పెంచుకోండి ॥ చిన్ని ॥

చిరువెన్నెల జాలుకన్న
పరిశుద్ధపు మనసు మీది
ఆ మనసుకు మలిన గుణం
అంటకుండ చూసుకోండి ॥ చిన్ని ॥

విశాలాంధ్ర
5-12-76

# ముత్యాల మాలలు

చూడు చూడుడు బాలలారా
చూడు దవిగో మనసు తీరా
నీలి గగనపు సీమ నక్ష
త్రాల బృందములన్

పన్నె చిన్నెల సన్నజాజులు
మిన్ను మీదను జల్లినట్టుగ
ఇంపు సొంపులు చిందు చుక్కల
గుంపు లయ్యవిగో

కనులవిందుగ గరిక పోచల
కొనలపైనా నిలిచి మెరిసే
మంచు చినుకులవోలె తారా
మాల లయ్యవిగో

అమరలోకములోని అచ్చర
లేమలుంచిన దివ్వెలేమో
ఆరకుండా వెలుగురిక్కల
బారు లయ్యవిగో

విశాలాంధ్ర
19-12-76

(మహాకవి గురజాడవారి ముత్యాల సరాల దాణీలో)

# బుజ్జాయి

బుల్లి నాన్న నవ్వరా
బుజ్జాయీ నవ్వరా
నీ నవ్వే మా యింటను
మాణిక్యపు దివ్వెరా!

చిన్ని నాన్న పలుకరా
చిట్టి బాబు పలుకరా
నీ పలుకులె మా వీనుల
తేనెజల్లు చిలుకురా!

చిన్ని కూన నడువరా
చిట్టి నాన్న నడువరా
నీ నడకలె మా కనులకు
ఆనందపు విందురా!

చంటికూన ఆడరా
కొంటెనాన్న ఆడరా
నీ ఆటలె మామదిలో
వెన్నెలలే చిందురా!

విశాలాంధ్ర
9-1-77

# సీతాకోక చిలుక

సీతాకోకచిలుకను అయితే
చక్కని రెక్కలు నాకేవుండే
పూలతోటలూ
పంట పొలాలు
గట్టు పుట్టలూ
చెట్టుచేమలు
అన్నీ ఎగురుతు చూసొస్తా
ఆనందంగా నాట్యమాడతా
అలసటవస్తే పువ్వులమీదా
హాయిగ కాసేపాగుతా
ఆకలివేస్తే పూలతేనెలూ
తనివి తీరగా తాగుతా
చిట్టి పాపలకు
చిలిపి బాలలకు
నాలో రంగులు చూపిస్తా
నన్ను పట్టుకొన
చిన్ని బాలలూ
సరదా పడితే
పరుగులు పెడితే
తుర్రున ఎగిరీ
చేతికి దొరకక
దాగుడుమూతలు సాగిస్తా
వారిని యింకా ఊరిస్తా

విశాలాంధ్ర
23-3-80

# ఉడుత

అటు గెంతి యిటు గెంతి
చిటుకుమని చెట్టెక్కి
ఆడుకొను చిన్నారి ఉడతా
నినుచూసి నే మురిసిపోతా

ఆ గింజ యీ గింజ
చిలిపిగా కొరికేవు
చప్పుడైతే చాలు
చెంగుమని ఉరికేవు

గోడపై గొందిపై
గునగునా నడిచేవు
ఊత్తంటె ఎందుకో
ఊరికే జడిసేవు

మూడు చారల తోక
ముద్దుగా ఊపేవు
నిను చూచు వారలకు
కనువిందు గొలిపేవు

విశాలాంధ్ర
30-3-80

# చిరుగాలి

చిత్రమైనదానివిలే
ఓ చిరుగాలీ
వింతగొలుపు నీమహిమను
వినుతించాలీ
పసిబాలురు ఎగరేసే
గాలిపడగలూ
పడకుండా పై పైనే
నిలబెడతావూ
పచ్చికలో తరగలాగ
పరుగెడతావూ
పుచ్చటగా చెట్లనూపి
మురిపిస్తావూ ॥ చిత్రమైన ॥

నిదురించే పిట్టలనూ
కదిలిస్తావూ
నింగిలోకి ఎగిరేలా
బోధిస్తావూ
కన్నులకూ కానరాక
దాగుంటావూ
అలుపుతీర్చి అందర్నీ
అలరిస్తావూ
ప్రాణంగామారి నువ్వు
బతికిస్తావూ
సర్వజీవు లొకటేయని
చాటిస్తావూ
సమభావం ఎల్లప్పుడు
పాటిస్తావూ ॥ చిత్రమైన ॥

విశాలాంధ్ర
27-7-80
(3)

# బొండు మల్లెలు

గగనాన ఒంటిగా
కదలాడు మబ్బులా
ఒక నాడు నే కాల్వ
గట్టుపై తిరుగాడ

ఒకచోట కనిపించె
నాకు వేనకు వేలు
ముద్దుపాపలవంటి
బొండు మల్లియపూలు

నిత్యమూ దివిలోన
ముత్యాలవలె వెలుగు
తారలే దిగివచ్చి
చేరినట్టుగ తోచె

వయ్యారి చిరుగాలి
ఉయ్యాల లూగింప
ఆడుకొను ఆ పూలు
చూడ ముచ్చట వేసె

విశాలాంధ్ర
3-8-80

# గగనంలో వంతెన

కడలిపైన పరుగెత్తే
  ఓడలకన్నా
నదులమీద పయనించే
పడవలకన్నా
మిన్నులోన తిరుగాడే
మబ్బులెంతొ అందము
కన్నుల కానందము

ఏటిదరుల రెండింటిని
ఏకంచేసే వంతెన
ఎంతెంతో చిత్రము
వింతగొలుపు అందము

వాన వెనుక గగనంలో
వంతెనలా కనిపించే
ఇంద్ర ధనువు సోయగాలు
ఇంకా ఆనందము

విశాలాంధ్ర
19-4-81

# ధ్రువ తార

నవ్వాలి పాపాయి
నెల రాజు లాగ
మాయింట చీకట్లు
మాయమై పోగ

ఇవ్వాలి ఒక ముద్దు
చిరుగాలి లాగ
చిగురాకులా మనసు
ఉయ్యాల లూగ

చూడాలి పాపాయి
ధ్రువతార లాగ
వెలగాలి తలపులో
ఒక మెరుపు తీగ

ఆడాలి పాపాయి
లేతరగలాగ
ఆనంద వేణువులు
నాలోన మ్రోగ

(ఆంధ్రజ్యోతి వారపత్రిక)

# మా పా ప

మా పాప నవ్వులే
మరు మల్లెపూలు
నా యెదను మురిపించు
ఆ పరిమళాలు

మా పాప చూపులే
మాణిక్య దీపాలు
నాలోని చీకట్లు
అవి పారద్రోలు

మా పాప మాటలే
మధుర గేయాలు
అవి నాకు నిరతమ్ము
శ్రవణపేయాలు

(ఆంధ్రజ్యోతి వారపత్రిక)

# బుజ్జి నవ్వులు

బుజ్జి బుజ్జి నవ్వులు
బుల్లిపాప నవ్వులు
ఎల్లప్పుడు మురిపించే
మల్లెపూల జల్లులు

చిలిపి చిలిపి చూపులు
చిన్ని పాప చూపులు
చింతలన్ని మరిపించే
సిరి వెన్నెల సోనలు

చిట్టి పొట్టి మాటలు
చిరు పాపల మాటలు
హృదయాలను కరిగించే
మధుర మురళి పాటలు

పిచ్చి పిచ్చి ఆటలు
పసికూనల ఆటలు
మమతలెన్నొ వెలిగించే
మకరందపు ఊటలు

విశాలాంధ్ర
27-3-77

# మా బాబు

మాకేల జాబిల్లి
మా బాబు చాలు
వాడి నవ్వులె మాకు
వెలుగు వెన్నెల జాలు

మడులు మాన్యాల లేల
మా బాబు చాలు
వాడిమాటలె మాకు
వేయి వరహాలు

మాకేల మధుమాస
సుమ సోయగాలు
మావాడి చూపులే
విరజాజి పూలు

మాకేల పండుగలు
మా బాబు చాలు
వాడి ఆటలె మాకు
నిత్య సంతోషాలు

విశాలాంధ్ర
26-8-79

# మంచుజడిలో మల్లెపూలు

మంచుజడిలో స్నానమాడిన
మల్లెపువ్వులు చూడలేదా
చూడకుంటే పాపనవ్వులు
వాటికంటే మిన్నకాదా

చలువ వెన్నెలలో విరిసే
కలువరేకులు చూడలేదా
చూడకుంటే పాపకన్నులు
వాటికంటే మృదువుకాదా :

చల్లగాలికి పరుగులెత్తే
చిన్ని తరగలు చూడలేదా
చూడకుంటే పాపనడకలు
వాటికంటే ముద్దుకాదా

పూల ఋతువున గొంతువిప్పే
పికము పాటను వినగలేదా
వినకపోతే పాపమాటలు
అంతకన్నా తీపికాదా :

# తల్లికి అందం

నల్లమబ్బుకు
మెరుపు లందము
మల్లెపువ్వుకు
తెలుపు లందము

అమ్మా అంటూ
పిల్లలు పిలిచే
తియ్యని పిలుపులు
తల్లి కందము

గగన పీఠికి
చుక్క లందము
గున్నమావికి
చివురు లందము

బుడి బుడి నడకతొ
ఒడిలో చేరే
బుల్లిపాపలే
తల్లి కందము

విశాలాంధ్ర
2-9-79

(4)

# గులాబి

చూడు చూడు గులాబి
వేడుకైన గులాబి
విలాసంగ విరిసింది
కులాసాలు చిలికింది
ముళ్ళమధ్య మొలిచినా
మురిపాలను ఒలికింది. ॥ చూడు ॥

అమ్మ ఒడిని పాపలాగ
రెమ్మలలో నిలిచింది
కమ్మని తన అందాలను
కనమంటూ పిలిచింది. ॥ చూడు ॥

స్వల్పకాలమైన బ్రతుకు
చింత ఎందుకన్నది
పదుగురికీ ప్రమోదాన్ని
పంచిపెట్టమన్నది. ॥ చూడు ॥

విశాలాంధ్ర
12-6-77

# సన్నజాజి పువ్వులం

చిన్ని చిన్ని పిల్లలం
సన్నజాజి పువ్వులం
భరతమాత పెదవులపై
మెరిసే చిరునవ్వులం. ॥ చిన్ని ॥

కులం మతం భేదాలు
తెలియనట్టి వారలం
చెలిమితోను కలిసిపోవు
చిరుమబ్బుల దారులం. ॥ చిన్ని ॥

అంతస్తులు అంతరాలు
అర్థమవని ప్రాణులం
ఏటిమీది తరగల్లా
ఏకమయే కూనలం. ॥ చిన్ని ॥

కొన్నాళ్లకు ఫలయించే
గున్నమావి చివురులం
మమతా సమతలు పెంచే
భావిదేశ పౌరులం. ॥ చిన్ని ॥

(విశాలాంధ్ర)

# జట్టు

పువ్వూ తావీ జట్టు
నువ్వూ నేనూ జట్టు
ఏడుపు కట్టీ పెట్టు
ఇదిగో పాపా బిస్కెట్టు

నీరూ పాలూ జట్టు
నేనూ నువ్వూ జట్టు
ఇదిగో కోవా చెయిపట్టు
ఏడిస్తే మరి ఒట్టు

మబ్బూ మెరుపూ జట్టు
మన ఇద్దరమూ జట్టు
ఏడుపు విడిచీ పెట్టు
ఇదిగో బెల్లపు అట్టు

కన్నూ రెప్పా జట్టు
నేనూ నువ్వూ జట్టు
కూ బండిదిగో పట్టు
గున గున దీంతో పరుగెట్టు

నింగి జాబిలి జట్టు
నేనూ నువ్వూ జట్టు
ఇదిగో పాపా రాకెట్టు
అందరికీ మరి చూపెట్టు

ఆంధ్రజ్యోతి వారపత్రిక
21-7-72

# బేబీ

మల్లెపువ్వు తెల్లన
మబ్బుకొనలు తెల్లన
చిట్టిపాప చిరునవ్వులు
వాటికన్న తెల్లన

మందారం ఎర్రన
సందె నింగి ఎర్రన
చిట్టిపాప చిన్నిపెదవి
వాటి కన్న ఎర్రన

పంచదార తియ్యన
పుట్టతేనె తియ్యన
చిట్టిపాప ముద్దుసుడులు
వాటికన్న తియ్యన

శ్రీ గంధం చల్లన
శశి వెలుగులు చల్లన
చిట్టిపాప కౌగిలింత
వాటికన్న చల్లన

(ఆంధ్రజ్యోతి వారపత్రిక)

# అటు చూడవే అమ్మా

అటుచూడవే అమ్మ
ఆకాశమందూ
పేలాలు ఎవ్వరే
పారబోశారు ?

పేలాలు కాదురా
నా పిచ్చికన్నా
చాల దూరానున్న
చుక్కలవియన్నీ

వెన్నముద్దను ఎవరు
పైన పెట్టారే ?
వెన్నముద్దా కాదు
నా వెర్రి నాన్నా

చల్లగా వెలిగేటి
చందమామదిరా
పట్టుపరదాలెవరు
పరచి ఉంచారే ?

పరదాలు కాదురా
మురిపాల కూనా
మెల మెల్లగా కదులు
తెలి మబ్బులవిరా

(ఆంధ్రజ్యోతి వారపత్రిక)

# నవ్వరా

నవ్వరా నవ్వరా
నా చిన్ని నాన్న
తూర్పుకొండను వెలుగు
తరుణ సూర్యునిలాగ
అమ్మ గుండెను వున్న
చిమ్మచీకటి పోగ ॥ నవ్వరా ॥

నవ్వరా నవ్వరా
నా చిన్ని నాన్న
పూర్ణిమా సమయాన
చంద్రబింబములాగ
జనని మనసే పాల
సంద్రమై చెలరేగ ॥ నవ్వరా ॥

నవ్వరా నవ్వరా
నా చిన్ని నాన్న
చిరుగాలి తాకిడికి
పరుగెత్తు అలలాగ
తల్లిహృదయము పొంగి
సెలయేరులా మ్రోగ ॥ నవ్వరా ॥

ఆంధ్రజ్యోతి వారపత్రిక
22-1-71

# వర్షం - హర్షం

నల్లమబ్బులు నింగి
నల్లుకోవాలీ
చల్లగా చిరువాన
జల్లు కురవాలీ ॥ నల్ల ॥

చిరువాన జల్లులో
చెల్లాయి నేనూ
చెట్టు చేమల్లాగ
స్నానమాడాలీ ॥ నల్ల ॥

ఉరవళ్ల పరవళ్ల
ఉరుములను వింటే
భయముతో పంచలకు
పరుగు తీయాలీ ॥ నల్ల ॥

కళ్లు మెలిగే మెరుపు
కాంతులను చూసీ
ఉడత పిల్లల్లాగ
ఉరక లేయాలీ ॥ నల్ల ॥

కాగితాలతొ బుల్లి
పడవలనుచేసీ
చూరుకిందను పారు
నీట వదలాలీ ॥ నల్ల ॥

(ఆంధ్రజ్యోతి వారపత్రిక)

# అమ్మా!

అమ్మా! నువు నీలాలా
ఆకాశం అయితే
నేను చందమామనై
నీలోనే వెలుగుతా

అమ్మా! నువు కదలాడే
నల్లమబ్బువైతే
మెరుపుతీగనై నీలో
మురిపెంగా నవ్వుతా

అమ్మా! నువు అల్లుకున్న
పొదరిల్లే అయితే
విరబూసిన పువ్వునై
సరదాగా ఆడుతా!

ఆంధ్రజ్యోతి వారపత్రిక
13-4-73

# పాల నురుగులు

వండు వెన్నెల - వెలుగు
పాలనురుగుల మెరుగు
మా బాబు నవ్వులో
  వెల్లివిరిసేను

వేయి తారల కులుకు
వెండిమబ్బుల తళుకు
మా బాబు కనులలో
  తొంగి చూసేను

తీయ తేనియ తేట
కోయిలమ్మలపాట
మా బాబు నుడులలో
  విందుచేసేను.

విశాలాంధ్ర
28-11-76

# పాప నవ్వులు

నిండు పున్నమినాటి
నెలరాజు మల్లె
నట్టింట పాపాయి
నవ్వులను వెదజల్లె

తండ్రి మనసున పాల
కడలి తరగలు లేచె
తల్లి మది మమకార
మల్లియలు విరబూచె

చెంగుమని చెట్లపై
చెరలాడు ఉడతల్లె
చిట్టి అడుగుల పాప
చిందేసి విలసిల్లె

తెలి మబ్బు తళుకులే
తల్లి కన్నుల మెరిసె
తీయ తేనియ వాన
తండ్రి తలపున కురిసె

విశాలాంధ్ర
15-7-79

# కోయిల

తియ్యమావి కొమ్మల్లో
ఓ కోయిలా
తీసేవూ రాగాలూ
సన్నాయిలా

చెట్టు పుట్ట నీ పాటను
ఓ కోయిలా
చెవులు విప్పి వింటున్నవి
హాయి హాయిగా

ప్రతిపుష్పా నీ పాటను
ఓ కోయిలా
పక పక మని నవ్వింది
పాపాయిలా

కూ కూ యను నీ పాటకు
ఓ కోయిలా
నా గుండెలు గంతులేసె
కొండవాగులా

అరమోడ్చిన కన్నులతో
ఓ కోయిలా
ఆలకింతు నీ గానం
మహాయోగిలా

విశాలాంధ్ర
22-7-79

Acc No: 11,705.

# కలయికలో వున్న విలువ

కర్రలాగ దూరంగా
బిర్రబిగిసి నిలిచివున్న
ఒకటంకెతో యిట్టులంది
చెలిమిమీర ఒకసున్నా

"ఎవ్వరితో అంటకుండ
ఉంటి వేల ఒంటిగా
ఉందామా యిద్దరమూ
ఇకముందర జంటగా"

ఒకటి—

"చాలులేవె విలువలేని
బోలుకడుపు సున్నా
నీకు నాకు జట్టేమిటి ?
నవ్వే రెవరన్నా ।"

సున్నా— "తెలివి మాలి పరులనెపుడు
చులకనగా చూడకు
కలయికలో వున్న మేలు
తెలియక మాటాడకు।

నాకు విలువలేదు నిజమె
నేను ఒప్పుకుంటా
నావల్లను నీకు పెరుగు
విలువ చూడ మంటా!

ఒంటరిగా వున్నావా
ఒకటి కిందె నువు లెక్క
పదిరెట్టులు నీకు విలువ
నేను వుంటె నీ ప్రక్క!

బాలజ్యోతి మే 81

# సహకారం (గేయకథ)

"పొద్దువాలక ముందె
గూటి కొస్తాను
కడుపునిండా మీకు
మేత తెస్తాను"

అని పిల్లలకు ఒక్క
గోరింక చెప్పింది
మేతకై తిరుగుతూ
తన దారి తప్పింది.

అనుకోని రీతిగా
పెనుగాలి హెచ్చింది
చిమ్మ చీకటి చుట్టు
కమ్ముకొని వచ్చింది.

గోరింక గుండెలో
గుబులు పెరిగింది
పోలేక ఒక చెట్టు
కొమ్మపై ఒరిగింది.

కొంత సేపయ్యాక
తెప్పరిల్లింది
చిన్ని కూనలపైకి
మనసు మళ్లింది.

తన పిల్ల లేమైరా
అనుకుంటు ఏడ్చింది
సులివెచ్చ కన్నీళ్లు
నేలపై రాల్చింది.

మిణుగు రొకటొచ్చింది
ఇంతలో అటుకేసి
జాలిపడి యిటులంది
గోరింక స్థితి చూసి

"ఏడువకు గోరింక
ఏడువకు నీ వింక
నీకు సాయము చేతు
నా చేత నైనంత

చిరు దివ్వెలా నేను
చూపింతులే దారి
చల్లగా సుఖియించు
నీ పిల్లలను చేరి"

అది విన్న గోరింక
ఎద ఊరడిల్లింది
మిణుగురును వెన్నంటి
తన గూటి కెళ్లింది.

బాలజ్యోతి సెప్టెంబర్ 1981

# మిణుగురు

మొలక చీకటిలోన
తళుకుమని మెరిసేటి
చిన్ని మిణుగురు పురుగు
సింగారమును గాంచి

ఒక కొంటె బాలకుడు
చకితుడై నిలిచాడు
ఎట్టులైనా దాన్ని
పట్టుకొన తలిచాడు

వెంటబడి తరుముతూ
తంటాలు పడ్డాడు
చివరికెటులో దాన్ని
చిక్కించు కున్నాడు

"ఇప్పుడేరీతిగా
తప్పించుకుంటావు ?
చూస్తాను" అని చెప్పి
సీసాలో పెట్టాడు

చెరనుండి బయటపడు
తెరువేది కనరాక
ఇటులంది ఆ పురుగు
కొంటె బాలుని చూసి

"ఎందుకని నన్నిటుల
బంధించి వుంచావు
ననుచంపి నీవేమి
సాధించ నెంచావు

"నామేని విగ నిగలు
చూడకోరితి వేని
చీకటిలో నన్నొదులు
చిలిపితనమును మాని"

అని మిణుగురెంతగా
బతిమాలినాగాని
సుతరాము వినలేదు
మతిమాలి బాలకుడు

పొద్దున్నె బాలకుడు
బుద్ధిగా లేచాడు
మిణుగురును పరికించ
సీసాను తెరిచాడు

పడివుంది అందులో
చచ్చిపోయిన పురుగు
దాని మేనికి లేదు
రాత్రి చూసిన మెరుగు

# తల్లి మనసు

తప్పటడుగుల నాన
త్వర త్వరగ రారా
చిట్టిచేతులు చాపి
చుట్టేసుకోరా

చూపు సోకునా యేమొ
నాదరికిరారా
దిష్టి తీస్తా నీకు
నా దిగులు తీరా

బోసి నవ్వుల కూన
బువ్వ తిన రారా
గోరుముద్దలు చేసి
కుడిపింతు లేరా

ఆటలాడీ నీవు
అలసిపోయావూ
చాలులే యికరార
లాలపోస్తాను

చిన్నారి పూలన్ని
నిన్నె చూశాయీ
పరమసంతోషాన
విరగబూశాయీ

మంచిబట్టలువేసి
ముస్తాబుచేసి
నీమోము ముద్దాడి
మురిసిపోతాను

# ప్రకృతిలో పాపాయి

పాపాయి నవ్వులే
పై పైకి పయనించి
విను వీధి చుక్కలై
వెలుగుతున్నాయి

పాపాయి మనసులో
రూపొందు ఊహలే
తెలి మబ్బు తునకలై
తిరుగుతున్నాయి

పాపాయి మాటలే
పంచవన్నెలుదాల్చి
చిలకలై తోటలో
పలుకుతున్నాయి

పాపాయి చూపులే
జాబిల్లి తళుకులై
సర్వదిక్కుల సుధలు
చిలుకుతున్నాయి

విశాలాంధ్ర
11-7-82

# గాలిపటం

పై పైకి సాగింది
పాములా ఊగింది
నా గాలిపటమదిగో
నాట్యాలు చేసింది

గెద్దలా ఒకసారి
గిరికీలు కొట్టింది
పరుగెత్తు మబ్బులతో
పంతాలు పట్టింది

వింతగా తనతోక
వంకర్లు తిప్పింది
చిరుగాలి ఊపులకు
జంకనని చెప్పింది

పగటి వెలుగున పాల
పిట్టలా కులికింది
కదిలేటి చుక్కలా
కనువిందు గొలిపింది

బాలజ్యోతి, డిశంబరు 81

# గాలిలో దీపం

అదిగదిగో జాబిల్లి
అటుచూడవే అక్క
గాలిలో దివ్వెలా
వెలిగేను ఎంచక్క

మొన్న చూస్తె విల్లులాగ
ఒంపు తిరిగి ఉన్నాడు
చిత్రంగా యింతలోనె
సున్నాలా మారాడు

పరుగుతీయు మబ్బులతో
దోబూచులు ఆడతాడు
ఎంత పిలిచినా గాని
ఎందుకు మనదరికి రాడు ?

చల్లగాలి తగిలి వొణుకు
మల్లెపువ్వులాగ వున్న
చిన్ని తారపంక చూడు
దాని తమ్ముడేమొ వాడు

రెక్కలుంటె మనం కూడ
రయ్యి మంటు పైకిపోయి
జాబిలితో దోబూచులు
ఆడుకుంటె ఎంత హాయి

# చిరుత ప్రాయులం

పాలవంటి బాలలం
చిరుత చిరుత ప్రాయులం
గురువులకూ పెద్దలకూ
నిరతం విధేయులం

నీడలేని పేదలకూ
తోడులేని దీనులకూ
మేలుకోరి సాయపడే
జాలిగుండె వారలం

మంచితనం మమకారం
మాకునచ్చు గుణజాలం
మధురమైన మాటలకే
మనసుయిచ్చు పాపలం.

॥ పాల ॥

అదిరింపులు బెదిరింపులు
ఒప్పుకోని ప్రాణులం
ఆదరణకు లాలనకూ
ఎప్పుడు స్వాధీనులం

పేద గొప్ప భేదాలను
పాటించని బాలలం
సమతన్నా చెలిమన్నా
ప్రేమించే పాపలం

విశాలాంధ్ర
14-2-82

MEMORIAL
V.R. NARLA
D.P.R.L.
ACC. No

## భారత మాత

భరతమాత వందనం
భవ్యచరిత వందనం
ఏ భాషలు పలికినా
నీ బిడ్డల మందరం

నదుల పేరు లేవైనా
నీరు ఒకటి కాదా
పలురంగుల మబ్బులుండు
ఒకే నింగిమీద

మతం కులం ఏదైనా
మేము అన్నదమ్ములం
ఎక్కడ నివసించినా
ఒక్కచెట్టు కొమ్మలం


ఒకేతోట పువ్వులమై
చల్లగ జీవించుతాం
ఒకేగూటి దివ్వెలమై
తల్లిని సేవించుతాం

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

BCi

A0UA105B133

BC



## నా గురించి

జననం: జూలై 15 వ తేదీ 1943 ఏలూరులో

విద్యాభ్యాసం: పి. యు. సి. వరకు సర్. సి. ఆర్. ఆర్. కళాశాలలో. ప్రస్తుతం ప్రైవేటుగా బి. ఎ. పూర్తిచేస్తున్నాను.

ఉద్యోగం: రోడ్డురవాణా సంస్థలో 1974 నుండి ఏలూరు డిపోలో పనిచేస్తున్నాను.

1965 వ సంవత్సరంనుండీ రచనలు చేస్తున్నాను. ఇంతవరకూ నా రచనలు ఏవీ పుస్తకరూపంలోరాలేదు. ఇదే నా ప్రథమ గేయసంకలనం. 1974 లో సుప్రసిద్ధ అభ్యుదయ కవులు సోమసుందర్, అనిసెట్టి సంయుక్తంగా ప్రచురించిన 'యువకవిత' అనే సంకలనంలోకి నేను వ్రాసిన ఒక వ్యంగ్య కవితను తీసుకున్నారు. కవితారచనకంటే కవితా పఠనమంటేనే ఎక్కువ యిష్టం.

ఇట్లు

రచయిత

## మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B133 |
| పుస్తకం పేరు | చిరుమల్లెలు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 69 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | c1 BC1 |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | Kethura |
| పేజీలు సరిచేసినది | Kethura |
| స్కాన్ చేసినది | teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |